# మాంగళ్యానికి మరో విలువ



★

రచన :

* టి. సుకన్య *

వాన జోరు హెచ్చింది. ఉరుములు, మెఱుపులలో భయంకరంగా కురుస్తుంది. ఇంకా ఆవేళవరకూ ఇల్లు చేరని, సీతాలు రాక కోసం, నిరీక్షిస్తూ గుమ్మందగ్గర కూర్చున్నాడు వెంకన్న. ఏడయింది కాబోలు స్వగతంగా అనుకున్నాడు. పిల్లలు తల్లి రాక కోసం కాలే కడుపులతో ఎదురు చూస్తున్నారు ఒకటి రెండు సార్లు "అమ్మేది? అయ్యా!" అంటూ అడిగారు.

శరభయ్య ఇద్దరు కూతుళ్ళలో రెండోది సీతాలు. సీతాలు అక్క, నాగరత్నం, బావ వెంకన్న అక్కడక్కడా కూలిపనులు చేసి డబ్బు సంపాదిస్తారు. నాగరత్నం కొందరిళ్ళలో పాచి పనులు కూడ చేస్తుంది. ఈ విధంగా వారి కుటుంబం ఆకలిబాధ లేకుండా జీవిస్తుందని సంతోషించేది, అప్పుడప్పుడు అక్కను చూడ వచ్చిన సీతాలు.

ఏడాదిక్రితం అనుకోకుండా, జబ్బుచేసి కన్ను మూసింది నాగరత్నం. పిల్ల పెంపకార్థం, సీతాలుని వెంకన్న కిచ్చి చేశాడు శరభయ్య. సీతాలు కూడ మనస్ఫూర్తిగా ఒప్పుకుంది. సీతాలు ప్రేమాభిమానాలతో, అతి త్వరలో పిల్లలను మచ్చిక చేసుకుని, "అమ్మా"! అని పిలిపించుకోసాగింది. నాగరత్నం చేసే ఇళ్ళలోనే పనికి కుదిరింది సీతాలు.

రోజూ, ఇంటింటా పని ముగించుకొని, ఆరింటికల్లా అందరూ పెట్టిన అన్నం మూటతో, గుడిసె చేరేది సీతాలు.

ఆరోజు దొరగారింట్లో పార్టీ ఉందని తెలుసు వెంకన్నకు. ఎంత పార్టీ అయితే మాత్రం, మధ్యాహ్నం నుంచి మొదలైన పార్టీ ఇంకా పూర్తి కాకుండా ఉంటుందా? పైగా వర్షమొకటి, ఇంట్లో పిల్లలు భయపడ్తారని ఇంకాస్త ముందుగానే రావల్సింది సీతాలు. సాధారణంగా వెంకన్న రాత్రి ఎనిమిది, తొమ్మిదింటికి గాని రాడు. ఈ రోజు కూలి దొరకనందున, వర్షం వచ్చే సూచనలున్నాయని ఇల్లుకు చేరాడు. అప్పుడే మూడు గంటలు గడిచాయి. సీతాలు జాడలేదు ఎక్కడో పిడుగు పడ్డశబ్దం. నగరంలో విద్యుద్దీపాలారి పోయినవి. పిల్లలు భయంతో కేకలు పెట్టి తండ్రిని పెను వేసుకున్నారు.

బయట వెంకన్న పెంపుడు కుక్క, ఎందుకో భౌ! భౌమని మొరిగి ఊరుకుంది. తనకు పరిచితమైన అడుగుల సవ్వడి విని కాబోలు. తడిక తోసుకుని లోపల ప్రవేశించింది సీతాలు. మనిషి అలికిడి గ్రహించి, మూలనున్న గుడ్డిదీపపు వత్తిని పెంచి తన ముసలికళ్ళతో, సీతాలుని పోల్చుకోలేక "ఎవరదీ?" అన్నాడు.

"నేనే! మావ!" అంటూ అంతవరకూ బిగబట్టి

MAHENDRA ISI

పంపులు – మోటారులు

మీరు...

ఎక్కువ పంటలు పండించుటకు



మహేంద్ర



పంపులు మరియు మోటారులకు అమర్చండి.

"మహేంద్ర" ఎలెక్ట్రిక్ మోటారులు మరియు సెంట్రిఫ్యూగల్ పంపులు సింగిల్ ఫేస్, 3 ఫేస్ మోనోబ్లాక్స్ కప్పల్డ్ సెట్ మరియా బెల్ట్ పంపులు అన్ని సైజులలోనూ దొరుకును.

ఆంధ్ర ప్రభుత్వము వారిచే తక్కావి కంతులలో అంగీకరించబడినది.

వివరములకు

ఫోన్: 30138. గ్రాం: "మహీపంప్"

**MAHENDRA ENGINEERING WORKS**
**Coimbatore - 641 037.**

నదుఖాన్ని, ఇక ఆపుకోలేనట్టు రెండడుగుల్లో వెంకన్నని వాటేసుకుని ఏడవ సాగింది.

"ఎవరూ? నువ్వేటే? ఎందుకేడుస్తావ్?" వెంకన్న హృదయం ఆర్ద్రమైంది. లాలనగా అడిగి విషయం తెల్సుకున్నాడు వెంకన్న.

ఆరోజు పార్టీ పనుల పేర సీతాలుని ఇల్లుకదల నివ్వలేదా దొరగారు. అతని భార్య పార్టీ అయిన తర్వాత ఫ్రెండ్స్‌ని డ్రాప్ చేయడాని కెళ్ళింది. వర్షం వస్తుందని ఇంటిదారి పట్టలేదు. అమ్మగారువచ్చాక చెప్పి, పెట్టింది తీస్కెళ్ళచ్చని ఊరుకుంది. బాగా మందు పుచ్చుకున్న దొరగారికి కళ్ళ ముందు కదిలింది సీతాలు.

సీతాలుని బలవంతం చేయబోగా, ఖాళీ విస్కీ బాటిల్‌తో అతన్ని గాయపరిచి, తప్పించుకొని, వర్షంలో తడుచుకుంటూ, ఇల్లుచేరింది. అంతా అమాయకంగా, నిష్కల్మషంగ, చెబుతున్న సీతాలు వెంకన్న కంటికి పసిపిల్లలాగ కన్పించగా సీతాలుని మరింతదగ్గరికి తీసుకుంటూ "ఊర్కో పిచ్చిదానా! ఏమైందిప్పుడు? ఆ తల్లిదయవల్ల బయట పడ్డావు," అంటూ పోలేరమ్మకు చేతులు జోడించాడు.

"ఆయింటికి పనికెళ్ళను మావా!"

"సరె! ఆతల్లిచల్లగ చూస్తె మరో ఇల్లు దొరక్కపోదు" అన్నాడు వెంకన్న.

అంతక్రితమె ఇక తల్లిరాదని నిరాశతో, పిల్లలు ముగ్గురూ, భయంతో, నేలమీదపడి నిద్రలోకి చేరారు ఆలాపడుకున్న పిల్లలకేసి జాలిగ చూస్తూ, ముగ్గురినీ పక్కలకు చేర్చి, తనమావ దేవుడు కాబట్టె తనను క్షమించాడని సంతోషంతో నిద్రలోకి జారింది సీతాలు.

♦ ♦ ♦

మూడు రోజులుగా వర్షం తగ్గడం లేదు. ఆ ఇల్లుపని మానేసినప్పటికీ మరో మూడిల్లు అంతకు ముందు నించే పనిచేస్తుండడం వలన ఎలాగో పిల్లల కడుపు నిండ గల్గుతుంది సీతాలు. ఏమైనా మిగిలితే వెంకన్నను తినమనేది. కాని వెంకన్న సీతాలుతో పంచుకు తినేవాడు. వర్షంలో కూడ వెంకన్న కూలికోసం తిరగని చోటు లేదు. రోజూ నిరాశతో ఇంటి ముఖం పట్టెవాడు. ఆ రోజు సాయంత్రం వెంకన్న, చలికి వణుకుతూ ఇల్లు చేరాడు. మర్నాటికి జ్వరం పట్టుకుంది. తను పుట్టినప్పటినించీ చిన్న జబ్బు

కూడ రాలేదన్నాడు. వెంకన్న జ్వరం హెచ్చింది. వర్షం తగ్గడం లేదు, విచారిస్తూ కూర్చుంది సీతాలు.

♦ ♦ ♦

ఛీ! వెధవ బ్రతుకు. బ్రతికినా ఒకటే చచ్చినా ఒకటే కసిగా కోపంగా విసుక్కుంది ప్రమీల. ఆమె రోజంతా అలాగే ఉంది. గదిలో ఓమూల, జ్వరంతో, దగ్గుతో, మూలుగుతూ, బాధపడుతూన్న సత్యమూర్తి పై, ఆమె వాడి చూపులు మాటిమాటికీ, విసురుతూనే ఉంది.

సత్యమూర్తి ప్రమీలను పెళ్ళాడి ఐదేళ్ళు కావస్తుంది. ఒక్క బిడ్డ కూడ పుట్టలేదు, పుట్టాలని కూడ ప్రమీలకు లేదు. ప్రమీల అత్తగారు మనవణ్ణి చూడాలనుకుంటూనే, చూడకుండా లోకంనించి నిష్క్రమించింది.

ప్రమీల నవనాగరికతా మోజులో దిగబడి ఉంది. ఆత్మీయతా, అనురాగం ఆమెలో మచ్చుకైనా కనబడవు. స్వేచ్ఛాజీవనమంటే ఆమెకు చాలా ఇష్టం. అత్తగారు మరణించాక, భర్తతప్ప, వేరే బంధాలు లేక పోవడం చేత ఆమె కోర్కెకు పునాదులేర్పడ్డాయి. సంపాదించిన ఐదువందలు తెచ్చి భార్య చేతిలో పోస్తాడు సత్యమూర్తి. అయినా ఆమెకు తృప్తిలేదు. నెలలో సగం రోజులు అతనికి ఒకేపూట భోజనం పెడుతుంది. అతన్ని ప్రేమగ చూడదు, భర్తగా గౌరవించదు.

ఈ మధ్యనే, ప్రమీలకు, పార్వతితో పరిచయం ఏర్పడి క్రమంగ ప్రగాఢ స్నేహంగ మారింది. పార్వతి ఆశయాలు ఆలోచనలు, ప్రవర్తన ప్రమీలకు నచ్చాయి. ఆమె అడుగుజాడల్లో నడవడం నేర్చుకుంది. ఆమె ద్వారా చాటుగ సంపాదించ సాగింది. హఠాత్తుగ ప్రమీల దగ్గరకన్పిస్తున్న విలువైన చీరెలు, నగలు చూసి ఎక్కడిదని అడగలేదు సత్యమూర్తి, ఆమె చెప్పలేదు. మొదటి సారిగ పార్వతితో కలసి ఆక్రొత్త వృత్తిలోకి దిగినప్పుడు, ప్రమీలను ఏదో శక్తి ప్రతిఘటించింది. దానికి (ఆమె అలా మారడానికి) కారణం భర్తల అసమర్థతేనని సహేతుకంగ వివరించి నచ్చచెప్పింది పార్వతి. దాన్ని ఆమోదించింది. ప్రమీలలోని అహంభావం. డబ్బుఇచ్చే రక రకాల సౌఖ్యాలు ఆమె మనసులో తిరిగి నోటికి తాళం వేసినాయి.

ఈ వారం రోజులుగ పార్వతి ఊళ్ళోలేదు. బాయ్


There is Joy
Where there is




JOTHI
ENGINEERING WORKS
Industrial Estate
MADURAI - 625 007.

--ATHMAS

ఫ్రెండ్‌తో కాశ్మీర్ ఊటీ, చూడడానికెళ్ళింది. తనకా వృత్తిలో అనుభవం తక్కువ. చేతిలో చిల్లిగవ్వలేదు. ఆయన రోగంతో మంచాన పడ్డాడు. ఉన్న పాతిక రూపాయలు మొహాన కొట్టి డాక్టరుకు చూపించుకోమంది, నల్గురూ నవ్వుతారని, అయినా తగ్గలేదు.

మొన్న కామాక్షిగారు కట్టుకున్న కాశ్మీర్ సిల్కు చీర ఆమెమనసులో బాగా ముద్రవేసుకుంది. 'ఈ మొద్దు మొహంతో కాశ్మీర్ ఎలాగు వెళ్ళలేను. ఆ కాశ్మీర్ చీరైనా లభిస్తుందా?' అని మనసులో తిట్టుకోసాగింది. పార్వతిలో స్నేహం ఏర్పడాక, ఆమె మనసును ఏకోరికా ఇంత సేపు వేధించలేదు. మనసు కోరిన వెంటనే సమకూర్చేది చేతిలోని డబ్బు, డబ్బులేకుండా ఇలా సతమతమయ్యే బాధలు చాలావరకామె మరచి పోయింది. ఆ చీర సంపాదించడానికి పథకం వేస్తున్న తరుణంలో ఆయనలా జ్వరంతో లీవు పెట్టి ఇంట్లో ఉండడం ప్రమీలకు విపరీతమైన కోపాన్ని కలుగచేసింది.

'ఎలా? ఆచీర సంపాదించడం ఎలాగ' ఈ ప్రశ్న ఆమెమనసులో చేరి ఊపిరి నలపనివ్వడం లేదు. నిరాశ ఆమెను వశంచేసుకుంది. కోపాన్ని మాటల్తో వెళ్ళగ్రక్క సాగింది.

భార్య ఈటెల్లాంటి, మాటలు వినలేక, మెల్లగా, ఓపిక చేసుకుని ఆఫీసుకేసి దారితీశాడు సత్యమూర్తి.

♦ ♦ ♦

వెంకన్నకు ఎంతకూ జ్వరం తగ్గడం లేదు. సీతాలు పనికెళ్ళ మనస్కరించక, ఇంటిపట్టునె ఉంటున్నది. వర్షం ఏ మాత్రం తగ్గడం లేదు. పిల్లలు ఆకలికి అలమటించి పోతున్నారు. వెంకన్న స్థితిచూసి సీతాలుకు ఏమీ తోచడంలేదు. దాదాపు స్పృహ కోల్పోయినట్లున్నాడు. అమాయకులైన పిల్లలు ఆకలికి ఏడుస్తున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేదు. ఇంట్లో అన్నం వండే మట్టి పాత్రలు, సత్తు గిన్నెలు, చింకిగుడ్డలూ తప్ప విలువైన వస్తువేది లేదు అడవిలో ఒంటరిగా చిక్కుకున్నట్లున్నది సీతాలు స్థితి.

'మావ తనమావ తనకు దూరమవుతాడా? తల్లీ కాపాడు!' ఈ చింతే సీతాలు మనసులో చోటుచేసుకుని, క్షణ, క్షణం భయం ఆమెను వశం చేసుకుని, భోరున ఏడ్పించింది.

డాక్టరుకు చూపించాలి, కనీసం తన మావ దక్కాలంటే జ్వరం తగ్గడానికైనా మందు వాడాలి. మూడు రోజులుగ గుక్కెడు మంచినీళ్ళయినా తాగలేను వెంకన్న. పిల్లలకు గంజికూడ పొయ్యలేక పోతుంది సీతాలు. తిరిగిన చోటల్లా తిరిగింది అప్పుకోసం, నెలాఖరు రోజులని ఎవరూ ఇవ్వలేదు. నెలజీతం ప్రయత్నించినా దొరకలేదు.

♦ ♦ ♦

“మావా” అంటూ వెంకన్న మీదపడి, కుదుప సాగింది. ఏడుస్తూనే బయట పడిన తాళిబొట్టు పచ్చగ మెరిసి, సీతాలు కన్నీరు ఆపింది. పసుపు తాడు మెడని ధరించి, మంగళసూత్రాలు పట్టుకుని, నిండా కొంగు కప్పుకుని, తడిక తోసుకుని వర్షంలో నడవసాగింది సీతాలు.

♦ ♦ ♦

భర్త అలా బయట పడగానె తేలిగ్గానిట్టూర్చి, మెదడుకు పదును పెట్టసాగింది ప్రమీల.

డబ్బుకోసం చాల రకాలుగ ప్రయత్నించింది ప్రమీల. నెలాఖరు కావడంచేత ఎక్కడా నగదు బేరం చిక్కలేదు. అనుభవ లోపం చేత, నేర్పుగ డబ్బు సంపాదించలేకపోయింది. బతిమాలడానికి అభిమానం అడ్డువచ్చింది. ఇల్లంతా గాలించింది. కానీకి కొఱగాని గిల్టునగలు, అల్యూమినియం గిన్నెలు, పైమెఱుగులు దిద్దుకొని, అమ్మకానికి పనికిరాని నకిలీ చీరలు ఆమెను వెక్కిరించాయి.

'ఛ! ఆ కాశ్మీర్ చీరముందు ఇవెంత! అని బాధ పడసాగింది. సత్యమూర్తి రాకుండానె పనిపూర్తికావాలి. అతని రిస్టువాచీ ఎనాడో కొట్లో పెట్టింది. ఇంకా ఏంమిగిలాయా? అంటూ ఆలోచించ సాగింది.

అద్దం ముందు కూచుని వంగి తన అందమైన ప్రతిబింబాన్ని చూసుకుంది. అలాగే ఇంకాస్త వంగి తన పెదవుల్ని స్పృశించింది. నిలువుటద్దం ముందు నిల్చుని నిలువెత్తు ప్రతిబింబాన్ని పరీక్షించుకుంది. “తన హఠాత్తుగ ఆమెకళ్ళు యెదనుండి వ్రేలాడుతున్న తాళిబొట్టుపై నిలిచాయి. చటుక్కున ఆమె మెదడులో ఆలోచన తట్టింది. పుటుక్కున తాళి తెంచి, గొడుగు చేతబట్టుకొని, వీధి వాకిలి మూసి బయటికి నడిచింది.

♦ ♦ ♦

“బాబూ! ఆపదలో ఉన్నాం మంచిధర ఇయ్యండి” అంటూ భద్రంగ కొంగున ముడివేసి తెచ్చిన